సాక్షి
విశాఖపట్నం

గురువారం ; 27 ; మార్చి ; 2025



బాధితురాలే అసలు దొంగ 8లో



వందేళ్ల జ్ఞాపకం..
విశాఖ విజయ రథం 8లో



టీడీపీలో మేయర్ గుబులు!

అవిశ్వాస తీర్మానంతో ఆందోళన



- నేరుగా రంగంలోకి దిగుతున్న మంత్రి లోకేష్
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేటర్లతో సమావేశం?
- వెంటాడుతున్న యాదవ సామాజికవర్గ డిమాండ్లు
- పీఠం ఆశిస్తున్న వ్యక్తులపై ఇప్పటికే అవినీతి మరకలు

ప్రలోభాలతో ప్రయత్నాలు



వాస్తవానికి జీవీఎంసీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు 2/3 మెజార్టీ అవసరం ఉంది. అయితే కూటమి పార్టీలకు అంత మెజార్టీ లేదు. కొద్ది మందిని బెదిరించి, మరి కొద్ది మందిని ప్రలోభాలకు గురిచేసి తమ వైపునకు లాక్కొనే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన మెజార్టీ (64 మంది కార్పొరేటర్లు) దక్కలేదు. ఈ నేపథ్యంలో మరింతగా ప్రలోభాలకు గురిచేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడటం ద్వారా నెగ్గేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ముగ్గురు నేతలకు బాధ్యతలను అప్పగించారు. వీరంతా కొద్ది మందిని నయానో భయానో తమ పార్టీల్లోకి చేర్చుకునే ప్రయత్నం చేశారు. అయినా 2/3 మెజార్టీ సభ్యులు కూటమి పార్టీల్లో చేరలేదు. అవిశ్వాసం నోటీసులో పలువురి సంతకాలను కూటమి నేతలే చేసినట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఇక లాభం లేదనుకుని నేరుగా లోకేష్ రంగంలోకి దిగుతున్నట్లు సమాచారం.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : కూటమి పార్టీలకు మేయర్ అవిశ్వాసం గుబులు మొదలైంది. నాలుగేళ్ల తర్వాత అవిశ్వాసం పెట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో మెజార్టీ లేకపోయినప్పటికీ కలెక్టర్‌ను కలిసి కూటమి పార్టీల నేతలు నోటీసులు అందజేశారు. ఒకవైపు అసలు మెజార్టీ లేకపోవడం ప్రధాన సమస్య కాగా.. తీరా నోటీసుల తర్వాత సొంత పార్టీలోనే మేయర్ పీఠాన్ని అధిష్టించేది ఎవరనే ప్రశ్నలతో పాటు తమ సామాజికవర్గానికే మేయర్ పీఠాన్ని ఇవ్వాలంటూ యాదవ నేతలంతా ఐక్యంగా గొంతు కలపడం కూటమి ప్రభుత్వానికి కునుకు లేకుండా చేస్తోంది. ఈ నేపథ్యంలో నేరుగా మంత్రి లోకేష్ రంగంలోకి దిగుతున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కార్పొరేటర్లతో సమావేశం కానున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పనికావడం లేదని భావించడంతోనే లోకేష్ తెరమీదకు వచ్చినట్టు సమాచారం. మరింతగా ప్రలోభాలు పెట్టో.. బెదిరింపులకు పాల్పడటం ద్వారానో అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన 2/3 మంది కార్పొరేటర్లను (64 మంది) లాగేసేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని విశాఖలో కూడా అమలు చేసేందుకే లోకేష్ వస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, లోకేష్ రాకపై అటు అధికార యంత్రాంగానికి.. పార్టీలోని ముఖ్యనేతలకు అధికారికంగా సమాచారం లేదు. కానీ లోకేష్ సమావేశం విషయం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ టీమ్ ద్వారా ప్రజాప్రతినిధులకు సమాచారం చేరవేస్తుండడం చర్చనీయాంశమవుతోంది.

అవినీతి ఆరోపణలతో...!

మేయర్ పీఠాన్ని ఆశిస్తున్న వ్యక్తితో పాటు డిప్యూటీ మేయర్లుగా రంగంలో ఉన్న మరో ముగ్గురు కార్పొరేటర్ల వ్యవహారశైలిపై ఇప్పటికే అనేక ఆరోపణలున్నాయి. స్టాండింగ్ కమిటీ సమావేశాల సందర్భంగా వసూళ్లతో పాటు ప్రతీ పనికీ ఇంత రేటు చెప్పి వసూలు చేస్తున్న వ్యవహారంపై అనేక విమర్శలున్నాయి. ఈ నలుగురు కలిసి ఇప్పటికే కార్పొరేషన్లలో తెగబడి చేస్తున్న వసూళ్లతో చెడ్డపేరు వచ్చిందని కూటమిలోని ఇతర కార్పొరేటర్లు మండిపడుతున్నారు. కొద్ది మంది కాంట్రాక్టర్లు బీజేపీ ఎమ్మెల్యేను కలిసి మరీ వసూళ్ల పర్వంపై ఫిర్యాదు కూడా చేశారని తెలుస్తోంది. అంతేకాకుండా నేరుగా టీడీపీ అధిష్టానానికి కూడా వీరి వ్యవహారశైలిపై ఫిర్యాదులు రావడంతో పునరాలోచన పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో లోకేష్ నిర్వహించబోయే సమావేశంలో ఏ నిర్ణయం తీసుకుంటారనే చర్చ సాగుతోంది.

యాదవ సామాజికవర్గ డిమాండ్‌తో...!

అవిశ్వాసం నేపథ్యంలో మేయర్ పీఠం తనదేనని ఇన్ని రోజులు ప్రచారం చేసుకున్న పీలా శ్రీనివాసరావు పేరు మరోసారి వినిపిస్తోంది. అయితే తమ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి మేయర్ పీఠం ఎక్కితే... తన ప్రాబల్యం తగ్గుతుందనే ఆందోళనతో స్థానిక ఎమ్మెల్యే సహకరించడం లేదని తెలుస్తోంది. మరోవైపు తన నియోజకవర్గం నుంచి డిప్యూటీ మేయర్లు కాబోతున్నారనే ప్రచారంతో మరో ఎమ్మెల్యే కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇక యాదవ సామాజికవర్గానికి చెందిన కార్పొరేటర్లందరూ అవిశ్వాస తీర్మానంపై గుర్రుగా ఉన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన మహిళకు పదవి వస్తే.. తట్టుకోలేక అవిశ్వాసం పెడుతున్నారంటూ లోలోపల రగిలిపోతున్నారు. కొద్ది మంది ముందుకు వచ్చి మరీ విమర్శలు గుప్పిస్తున్నారు. తమ సామాజిక వర్గానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని.. ఇప్పుడు అవిశ్వాసం పేరుతో వేరే సామాజికవర్గానికి మేయర్ పీఠం అప్పగిస్తే సహకరించే ప్రసక్తే లేదని తెగేసి చెబుతున్నారు. యాదవ సామాజికవర్గ డిమాండ్ల నేపథ్యంలో కూటమి పార్టీలోని ఆ సామాజికవర్గ ఇద్దరు ఎమ్మెల్యేలు కంగుతింటున్నారు. ఇది చిలికిచిలికి గాలివానలాగా మారి తమకు పెద్ద ఇబ్బంది తెచ్చిపెడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవిశ్వాసానికి వీరి నుంచి పెద్దగా మద్దతు ఉండటం లేదంటూ పీఠాన్ని ఆశిస్తున్న వ్యక్తులు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీంతో లోకేష్ తెర మీదకు వచ్చినట్టు అధికార టీడీపీలో చర్చనీయాంశమవుతోంది.


న్యాయవాదుల సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



ఎన్నికల అధికారి జీఎం రెడ్డి

విశాఖ లీగల్: ఈ నెల 28వ తేదీన జరిగే న్యాయవాదుల సంఘం ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల అధికారి జీఎం రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఖరారు చేసిన న్యాయవాదుల జాబితా ప్రకారం ఎన్నికలు జరుగుతాయన్నారు. 2,958 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు. జూనియర్, సీనియర్లు, 60 ఏళ్లు దాటిన న్యాయవాదులకు ప్రత్యేకంగా ఓటు వేయడానికి ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికలు ఉదయం 10.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయని, అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. రాత్రి పది గంటలకు ఫలితాలు వెల్లడిస్తామని జీఎం రెడ్డి వెల్లడించారు. ఏమైనా సమస్యలు ఉంటే తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. ఎన్నికలు సాఫీగా సాగడానికి నలుగురు ఉపఎన్నికల అధికారులను నియమించినట్లు తెలిపారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.57 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సభ్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 21 రోజులకు రూ.కోటీ 57 లక్షల 71 వేల 152 వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు తెలిపారు. సింహగిరిపై బుధవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 63 గ్రాముల బంగారం, 9.725 కిలోల వెండి లభించిందన్నారు. అన్నప్రసాద భవనంలోని హుండీ ద్వారా లక్షా 75 వేల 780 రూపాయలు లభించినట్లు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

చర్చలు విఫలం

- సమస్యలపై నేటిలోగా స్పందించకుంటే 28న సమ్మె
- ఆర్‌ఎల్‌సీ సమావేశంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకుల వెల్లడి



చర్చల్లో పాల్గొన్న అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం : రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సమక్షంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మిక సంఘాల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. గురువారం సాయంత్రంలోగా స్పందించకుంటే శుక్రవారం నుంచి సమ్మె చేస్తామని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అంశంపై బుధవారం ఆర్‌ఎల్‌సీ ఏర్పాటు చేసిన సమావేశంలో యాజమాన్యం ప్రతినిధులు, కాంట్రాక్టర్లు, కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. అందులో ప్రధానంగా యాజమాన్యం నిలిపివేసిన 288 మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మెడికల్ చెకప్ పేరిట కార్మికులను తొలగించరాదని, తీసివేసిన కార్మికులను గురువారంలోగా తీసుకోకపోతే ఈనెల 28న సమ్మె తప్పదని స్పష్టం చేశారు. దీనిపై యాజమాన్యం ప్రతినిధులు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు చెప్పిన కొంత మందిని తీసుకుంటామని, మెడికల్ చెకప్‌పై కార్మిక చట్టాల ప్రకారం నడుస్తామని తెలిపారు. మార్చి నెలాఖరు ఉత్పత్తికి కీలకం కాబట్టి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు యాజమాన్యానికి సహకరించాలని కోరారు. తమ డిమాండ్లపై యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో 28న ఉదయం 6 గంటల నుంచి 29 ఉదయం 6 గంటల వరకు సమ్మె చేస్తామని ప్రకటించారు. సమావేశంలో యాజమాన్యం నుంచి హెచ్‌ఆర్ జీఎంలు ఎస్.భాను, ఎం.మధుసూదనరావు, డీజీఎం ఖర్, మేనేజర్ శంకర్, కార్మిక సంఘాల నాయకులు జి.శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసరావు, కె.ఎం.శ్రీనివాసరావు, మంత్రి రవి, జి.సత్యారావు, టి.గుర్నాథ్, జి.అప్పన్న, వంశీకృష్ణ, యు.అప్పారావు పాల్గొన్నారు.

1,126 మంది వీఆర్‌ఎస్ ఆమోదం

ఎగ్జిక్యూటివ్‌లు 493
నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 633

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆమోదించిన స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్)లో ఎగ్జిక్యూటివ్‌లు కంటే నాన్ ఎగ్జిక్యూటివ్‌లే ఎక్కువగా ఉన్నారు. వీఆర్‌ఎస్ పథకానికి 1,613 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఉపసంహరణ, తిరస్కరణ దరఖాస్తులు పోగా మిగిలిన 1,126 మందికి యాజమాన్యం ఆమోదం తెలిపింది. ఇందులో చీఫ్ జనరల్ మేనేజర్ ఒకరు, జనరల్ మేనేజర్లు 38 మంది, డీజీఎంలు 160, ఏజీఎంలు 33, సీనియర్ మేనేజర్లు 208, మేనేజర్లు 17, డిప్యూటీ మేనేజర్లు 23, అసిస్టెంట్ మేనేజర్లు 13 మందితో కలిపి 493 మంది ఎగ్జిక్యూటివ్ కేటగిరీ ఉద్యోగులున్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో జనరల్ ఫోర్‌మెన్‌లు 523 మంది, ఇతరులు 110 మందితో కలిపి మొత్తం 633 మంది ఉన్నారు. వీరందరికీ ఈ నెల 31న వీఆర్‌ఎస్ ఉత్తర్వులు అందజేయనున్నారు.

30న శ్రీవారి సన్నిధిలో ఉగాది వేడుకలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30న టీటీడీ అర్చకులచే పంచాంగ పఠనం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు వేకువజామున 4 నుంచి 4.30 గంటల వరకు సుప్రభాతం, 4.30 నుంచి 6 గంటల వరకు అర్చన, కొలువు, తోమాల, సహస్ర నామార్చన, 6 నుంచి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 8.30 నుంచి 9 గంటల వరకు అర్చన, 9 గంటల నుంచి 10 గంటల వరకు స్వామి వారి ఆస్థానం, పంచాంగ పఠనం, రాత్రి 7 గంటల వరకు సర్వ దర్శనం, 7 నుంచి 7.40 వరకు అర్చన, 7.40 నుంచి 9.30 గంటల వరకు సర్వ దర్శనం, 9.30 నుంచి 10 గంటల వరకు ఏకాంత సేవ ఉంటుందని, భక్తులు గమనించాలని సూచించారు.

విశాఖ జిల్లా ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా మార్కండేయులు



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ విశాఖ జిల్లా ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా మార్కండేయులను నియమించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్ సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రోత్ హబ్ లక్ష్య సాధనకు చర్యలు

• కలెక్టర్ హరేందిర ప్రసాద్


సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: గ్రోత్ హబ్ లక్ష్యాలు చేరుకునేందుకు ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరుగుతున్న మూడో విడత కలెక్టర్ల సదస్సులో రెండో రోజు బుధవారం జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. విశాఖపట్నం రీజియన్ గ్రోత్ హబ్, వ్యవసాయ అనుబంధ రంగాల్లో చేపట్టబోయే చర్యల గురించి సీఎంకు వివరించారు. గ్రోత్ హబ్ కార్యసాధనలో భాగంగా విశాఖ రీజియన్‌లో నిర్దేశించిన 715 బిలియన్ డాలర్ల లక్ష్యం చేరుకునేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జీడీపీ వృద్ధిలో రీజియన్ వాటా 15.7 శాతం అనగా రూ.1,45,774 కోట్లు ఉండేలా కృషి చేస్తామని, తలసరి ఆదాయం రూ.6,14,763 సాధించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాథమిక రంగంలో రెట్టింపు వృద్ధి లక్ష్యాలు చేరుకుంటామని చెప్పారు. జిల్లాలో రంగాల వారీగా చూసినట్లయితే జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో వ్యవసాయ రంగం వాటా కేవలం 5 శాతం మాత్రమే ఉందని, దీన్ని 10 శాతానికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామన్నారు. నగదు రూపంలో చూస్తే రూ.68 కోట్ల మేర మాత్రమే వ్యవసాయ రంగం వాటా ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో అనేక కారణాల వల్ల సుమారు రెండు వేల హెక్టార్ల బీడు భూములు నిరుపయోగంగా ఉన్నాయని, వచ్చే ఏడాదిలో 200 హెక్టార్ల బీడు భూములను సాగులోకి తీసుకొస్తామన్నారు. వరి, చిరు ధాన్యాల సాగులో వినూత్న సంస్కరణలు చేపడతామని, కొత్త వంగడాలను ప్రవేశపెడతామన్నారు. వరిలో ఎంటీయూ-1224, ఆర్.ఎన్.ఆర్.-15048 వంటి వంగడాలను, మిల్లెట్లలో ఇంద్రావతి, వేగవతి వంటి నూతన రకాలను అందుబాటులోకి తీసుకొచ్చి.. ఉత్పాదకతను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.

వందేళ్ల జ్ఞాపకం.. విశాఖ విజయ రథం

దేశంలో ఎలక్ట్రిక్ రైలు కార్యకలాపాలు ప్రారంభమై వందేళ్లు పూర్తయ్యాయి. ఈ శతాబ్ది వేడుకల సందర్భంగా వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్తగా సంబరాలు చేసుకుంది. ఎలక్ట్రికల్ రైల్వే వ్యవస్థకు చిహ్నంగా థీమ్ బేస్డ్ స్పెషల్ ఇంజిన్‌ను రూపొందించింది. ఈ ఇంజిన్‌ను ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అనుసంధానించింది. త్రివర్ణ పతాకం ఐకానిక్‌గా.. విశాఖ చరిత్రను, విశిష్టతనుస్ఫురిస్తూ రైల్వే యంత్రాంగం 'విశాఖ విజయ రథం' పేరుతో ఈ అద్భుతమైన ఆవిష్కరణ చేసింది. – సాక్షి, విశాఖపట్నం

• ఎలక్ట్రికల్ రైల్వే వ్యవస్థకు వందేళ్లు
• థీమ్ బేస్డ్ ఇంజిన్ రూపకల్పన
• విశాఖ ఘనత చాటేలా వాల్తేరు లోకోషెడ్ శ్రద్ధ


ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు విశాఖ విజయరథం అనుసంధానాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్‌బోరా, అధికారులు


ఎలక్ట్రిక్ లోకో షెడ్ రూపొందించిన విశాఖ విజయరథం

బాంబే విక్టోరియా టెర్మినస్ (ప్రస్తుతం సీఎస్ఎంటీ), కుర్లా మధ్య 1925 ఫిబ్రవరి 3న మొదటి ఎలక్ట్రిక్ రైలు పరుగులు పెట్టింది. ఈ చారిత్రక రోజున భారతీయ రైల్వే వ్యవస్థ ఒక అద్భుతమైన మైలురాయిని అందుకుంది. ఆ తర్వాత ఇండియన్ రైల్వే వరుస విజయాలతో దూసుకుపోయింది. వందేళ్ల పండగకు ప్రతీకగా, వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్త ఆలోచనతో అద్భుతాన్ని ఆవిష్కరించింది. దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లలో ఒకటైన వాల్తేరు లోకోషెడ్ ఆధ్వర్యంలో థీమ్ బేస్డ్ లోకోను రూపొందించింది. దీనికి విశాఖ విజయరథంగా నామకరణం చేశారు. డబ్ల్యూఏపీ-7 (నం.39145)తో రూపొందించిన ఎలక్ట్రిక్ లోకోను బుధవారం విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి డీఆర్ఎం లలిత్‌బోరా జెండా ఊపి ప్రారంభించారు. ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) ఈ సీతారామ్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బి.షణ్ముఖరావు నేతృత్వంలో రూపొందించిన ఈ లోకోమోటివ్‌ను బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అనుసంధానించారు.

త్రివర్ణపతాకం.. విశాఖ వైభవం

వాల్తేరు ఎలక్ట్రిక్ లోకో షెడ్ 39145 నంబర్ గల WATE WAP-7 లోకోను రూపొందించినప్పుడు కీలక అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. దేశ గౌరవాన్ని ఇనుమడింపజేసేలా.. త్రివర్ణ పతాకంతో శోభిల్లేలా లోకో మొత్తం ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అంతేకాదు విశాఖ నగరపు ప్రత్యేకతలను ప్రపంచానికి తెలియజేసేలా కొన్ని ముఖ్యమైన చిహ్నాలను కూడా దీనిపై ముద్రించారు. ఈ లోకో ఇంజిన్‌పై తూర్పు నౌకాదళానికి గుర్తుగా జలాంతర్గామి, విశాఖపట్నం పోర్టు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలం ఆలయం, పారిశ్రామిక హబ్‌గా గుర్తింపు పొందిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ బొమ్మలు కనువిందు చేస్తున్నాయి. ఈ ప్రత్యేకమైన లోకో విశాఖ నగరానికి, భారతీయ రైల్వేకు గర్వకారణంగా నిలుస్తోంది.

కర్బన ఉద్గారాల నియంత్రణలో కీలకం..

శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు కర్బన ఉద్గారాలను నియంత్రించేందుకు ఇండియన్ రైల్వేస్ ఈ ఎలక్ట్రిక్ లోకోలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ అద్భుత ఘట్టానికి వందేళ్లు పూర్తవ్వగా, ఈ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా విశాఖ విజయరథం రూపొందించడం శుభపరిణామం. వాల్తేరు ఎలక్ట్రిక్ లోకో షెడ్ 336 లోకోల నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. నిరంతరం ఎంతో పని ఒత్తిడి ఉన్నా.. వందేళ్ల ఉత్సవానికి గుర్తుగా అద్భుతమైన లోకోను తీర్చిదిద్దినందుకు షెడ్ సిబ్బందికి కృతజ్ఞతలు. ఎలక్ట్రిక్ లోకోల రాకతో భారతీయ రైల్వే ప్రయాణ వేగాన్ని క్రమంగా పెంచుకుంటూ దూసుకుపోతోంది.
– లలిత్‌బోరా, వాల్తేరు డీఆర్ఎం

భారీగా మాదక ద్రవ్యాల పట్టివేత

బీచ్‌రోడ్డు : నగరంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసుల కఠిన చర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి 6.5 గ్రాముల ఎండీఎంఏ (మాదక ద్రవ్యాలు)ను స్వాధీనం చేసుకున్నారు. ఆశీలమెట్టలోని శ్రీ సాయిరాం డార్మిటరీ అండ్ హోమ్స్ వద్ద తనిఖీలు నిర్వహించగా కర్నాటకకు చెందిన రంగస్వామి నంజి గౌడ (23) అనుమానాస్పదంగా వ్యవహరిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని మూడో పట్టణ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ డ్రగ్స్ ఎక్కడ నుంచి వచ్చాయి? మరెవరికైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

బాలికను గర్భవతిని చేసిన వివాహితుడు

• పోక్సో కేసు నమోదు

ఎంవీపీకాలనీ: ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను గర్భవతిని చేసిన ఘటనలో సీహెచ్ సీతయ్య అనే వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాసవానిపాలేనికి చెందిన 14 ఏళ్ల బాలిక 21వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. ఆమె తల్లి, అన్నయ్యతో కలిసి నివసిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన వివాహితుడైన సీహెచ్ సీతయ్య గత ఏడాదిగా బాలికను ప్రేమ పేరుతో లోబరుచుకుంటున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఓ ఇంటికి తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. బాలిక ప్రవర్తనలో మార్పులు గమనించిన తల్లి అనుమానంతో ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించగా, గర్భవతి అని తేలింది. దీంతో ఆమె తల్లి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సీతయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితురాలే అసలు దొంగ

• నగదు, బంగారాన్ని మాయం చేసిన వృద్ధురాలు
• విచారణలో నిజం ఒప్పుకున్న పినగాడి చోరీ కేసు ఫిర్యాది
• 8 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.5 లక్షలు స్వాధీనం
• మరో రెండు కేసుల్లో 50 గ్రాముల బంగారం రికవరీ, ముగ్గురు అరెస్ట్

పెందుర్తి : 'నేను ఇంట్లో నిద్రపోతున్నాను. రాత్రి ఒంటి గంట సమయంలో ముగ్గురు దొంగలు వచ్చి నా మెడ మీద కత్తి పెట్టి ఇంట్లోని బంగారం, వెండి, డబ్బును దోచుకుపోయారు. ఇదంతా కష్టపడి సంపాదించుకున్న సొత్తు.. దయచేసి ఆ దొంగలను పట్టుకుని మాకు న్యాయం చేయండి.' ఇదీ గతేడాది డిసెంబర్‌లో పినగాడికి చెందిన షేక్ షకీనా అనే వృద్ధురాలు పోలీసులకు చేసుకున్న విన్నపం. నడిరోడ్డుపై ఉన్న ఇంట్లో అంత పెద్ద చోరీ జరగడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. మూడు నెలల పాటు నిందితులను పట్టుకోవడానికి అహర్నిశలు శ్రమించారు. ప్రతి గల్లీనీ జల్లెడ పట్టారు, అనుమానితులను విచారించారు. ఇంటి దొంగని ఈశ్వరుడైన పట్టలేరన్నది సామెత. కానీ పెందుర్తి పోలీసులు చిన్న పాటి క్లూతో పినగాడిలో ఇంటి దొంగను పట్టేశారు. సంచలనం సృష్టించిన పినగాడి చోరీ కేసులో బాధితురాలిగా ఫిర్యాదు చేసిన షేక్ షకీనాయే ఆ సొత్తును మాయం చేసి దొంగలు ఎత్తుకుపోయారని నమ్మించింది. ఈ వివరాలను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు వెల్లడించారు.

షేక్ షకీనాకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె. కాగా షకీనా రోడ్డు వద్ద ఉన్న పాత ఇంటిలో ఉంటుండగా సమీపంలోనే మరో ఇంట్లో కుమారులు కుటుంబాలతో ఉంటున్నారు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు మటన్ షాపు నిర్వహణ నిమిత్తం రూ.5 లక్షల నగదుతో పాటు ఇంట్లోని 8 తులాల బంగారం, 30 తులాల వెండి తల్లి వద్ద ఉంచాడు. అయితే గతేడాది డిసెంబర్ 3న రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న తన వద్దకు మూడు బైక్‌లపై వచ్చిన ముగ్గురు దొంగలు మెడ మీద కత్తి పెట్టి పై సొత్తును ఎత్తుకుపోయారని మరుసటి రోజు పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది.

మూడు నెలల తర్వాత సీన్ రివర్స్!

షకీనా చెప్పినదంతా నమ్మిన పోలీసులు తీవ్రంగా దర్యాప్తు చేశారు. కానీ ఎటువంటి ఆధారాలు లభించలేదు. వారం రోజుల కిందట షకీనా రహస్యంగా వెండి వస్తువులను తీసుకువెళుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆమెను విచారించగా అసలు విషయం బయటపడింది. తన భర్త చేసిన అప్పులు తీర్చడానికి ఆ సొత్తును తానే దాచిపెట్టినట్లు ఒప్పుకుంది. పోలీసులు ఆమె వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయిస్తామని సీఐ తెలిపారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

11 కేసుల్లో భార్యాభర్తల అరెస్ట్

చేతికున్న నకిలీ ఉంగరాలను బంగారం దుకాణాల్లో చూపి.. కొత్త ఉంగరాలను ఎత్తుకుపోతున్న భార్యాభర్తల ఆటకట్టించారు పోలీసులు. కోనసీమ జిల్లా రామచంద్రాపురం జెండా వీధికి చెందిన పిన్నింటి గణేష్, అతడి భార్య కొవ్వూరి మాణిక్యేశ్వరి ఉమ్మడి జిల్లాలోని పీఎం పాలెం, పెందుర్తి, భీమిలి, ఎంవీపీ కాలనీ, కంచరపాలెం, యలమంచలి, గాజువాక, గోపాలపట్నం, చోడవరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని 11 బంగారు దుకాణాల్లో 12 ఉంగరాలను ఎత్తుకుపోయారు. ఈ క్రమంలో పెందుర్తికి చెందిన బంగారం దుకాణం యజమాని డెక్క రమణ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు దొంగలిద్దరినీ పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాయుడుతోటలో గత నెలలో ఇంట్లోకి చొరబడి మహిళ కళ్లల్లో స్ప్రే కొట్టి మెడలో పుస్తెల తాడు ఎత్తుకుపోయిన జంజూరి అంబేడ్కర్ అనే యువకుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. సమావేశంలో పెందుర్తి క్రైం విభాగం ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ కె.వి.ఎస్.ఎన్ మూర్తి, హెచ్‌సీ జి.నాగరాజు, పీసీలు జి.శ్రీనివాసరావు, పి.చినపైడి రాజు, వి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'అన్నా'.. అన్నందుకు దాడి

• తీవ్రంగా కొట్టి.. దుస్తులు విప్పించి..
• ఫుడ్ డెలివరీ బాయ్‌పై దాడి కేసు విచారణలో వెలుగులోకి..


సాయికుమార్‌పై కర్రతో దాడి చేస్తున్న ప్రసాద్

ఎంవీపీకాలనీ: స్విగ్గీ ఫుడ్ డెలివరీ బాయ్ హరిదేవ సాయికుమార్‌పై దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి పోలీసుల విచారణలో అవాక్కయ్యే వాస్తవాలు వెలుగు చూశాయి. డెలివరీ బాయ్ సాయికుమార్ 'సార్' అని కాకుండా 'అన్నా'అని సంబోధించడం నిందితుడు పాంద్రంకి ప్రసాద్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. 'ఎవడ్రా నువ్వు నన్ను అన్నా అని పిలుస్తున్నావ్' అంటూ ప్రసాద్ సాయికుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. 'సార్ డెలివరీ ఇచ్చేశాను. అయిపోయింది కదా.. నాతో ఇష్యూ ఎందుకు? వదిలేయండి సార్' అని చెప్పినా వినకుండా ఆక్సిజన్ టవర్స్ 29వ అంతస్తు నుంచి కిందివరకు వెంబడించి చొక్కా కాలర్ పట్టుకుని మరీ దాడి చేశాడు. అక్కడితో ఆగకుండా సెక్యూరిటీ గార్డ్‌ల సహకారంతో గేటు వద్ద సాయికుమార్‌ను నిలువరించి 'నీ స్థాయి ఏంటి? నా స్థాయి ఏంటి? నన్నే అన్నా అని పిలుస్తావా?' అంటూ కర్రతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. గేటు వద్ద అప్పటికి మరికొందరు డెలివరీ బాయ్స్ ఉండటంతో వ్యతిరేకత వస్తుందని భావించి.. సెక్యూరిటీ రూమ్‌లోకి తీసుకెళ్లి దుస్తులు విప్పించి దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఈ ఘటనలో తప్పంతా తనదే అని ఒప్పుకున్నట్లుగా సాయికుమార్‌తో రెండు లేఖలు కూడా రాయించుకున్నాడు. తర్వాత దుస్తులు లేకుండానే గేటు బయటకు పంపించాడు. బుధవారం ఈ ఘటనలకు సంబంధించి సీసీ పుటేజ్‌లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఆ వీడియోలు చూసిన పలువురు ప్రసాద్ వ్యవహరించిన తీరు అమానవీయతకు అద్దం పట్టిందంటూ విమర్శించారు.

ఏప్రిల్ 7 వరకు రిమాండ్

ఈ ఘటనపై సీపీ ఆదేశాలతో విచారణ వేగవంతం చేసిన పోలీసులు.. నిందితుడు పాంద్రంకి ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అతన్ని అరెస్ట్ చేయడంతో పాటు ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో హాజరుపరిచారు. దీంతో కోర్టు అతనికి ఏప్రిల్ 7వ తేదీ వరకు రిమాండ్ విధించింది. అయితే విచారణతో పాటు ప్రసాద్‌ను కోర్టులో హాజరుపరచడంలో పోలీసులు గోప్యత పాటించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆక్సిజన్ టవర్స్‌కు ఫుడ్ బంద్

సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ లోపలికి ఫుడ్ డెలివరీ నిలిపివేస్తున్నట్లు స్విగ్గీ, జొమాటో వంటి వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఫుడ్ డెలివరీ బాయ్స్ మీడియాకు తెలిపారు. నగరంలోని ఫుడ్ డెలివరీ బాయ్స్ అంతా కలిసి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సాయికుమార్ అనే ఫుడ్ డెలివరీ బాయ్‌పై ఆక్సిజన్ టవర్స్‌లోని ఓ ఫ్లాట్ యజమాని ప్రసాద్ దాడి చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినట్లు గుర్తు చేశారు. ఆరు నెలల వరకు ఆక్సిజన్ టవర్స్ లోపలికి ఫుడ్ డెలివరీ చేయబోమని, కేవలం ప్రధాన గేటు వద్ద డెలివరీ ఇస్తామని డెలివరీ బాయ్స్ స్పష్టం చేశారు.

నకిలీ వెండి ఇచ్చి బంగారం అపహరించబోయి..

• పాత మహిళ నేరస్తులు అరెస్ట్ ..

సీతమ్మధార : జ్యూయలరీ దుకాణంలో నకిలీ వెండి ఇచ్చి బంగారం అపహరించబోయిన ఇద్దరు పాత నేరస్తులను ద్వారకా పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. పంజాబ్‌కు చెందిన ఇద్దరు మహిళలు బుధవారం ద్వారకానగర్‌లోని వైభవ్ జ్యూయలరీ దుకాణానికి వెళ్లి మూడు కిలోల వెండి చూపించారు. దాన్ని తీసుకొని బంగారం కావాలని చెప్పారు. అనుమానం వచ్చిన దుకాణ ఉద్యోగులు వెండిని తనిఖీ చేయగా నకిలీ అని తేలడంతో ద్వారకా సీఐ డి.వి. రమణకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ వారిని విచారించి క్రైం పోలీసులను అప్రమత్తం చేశారు. ఇద్దరు మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 2024లో ఇదే తరహాలో అదే బంగారు దుకాణంలో నకిలీ వెండి ఇచ్చి బంగారం అపహరించారు. గతంలో వచ్చిన మహిళలు వీరే అని గుర్తించి వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వారి వద్ద నుంచి రూ.5,500 స్వాధీనం చేసుకున్నారు. ఇదే ప్రాంతంలో లాడ్జీలు తనిఖీలు చేసిన పోలీసులు మరో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

డీఎస్సీ కోచింగ్ వెబ్ ఆప్షన్స్‌కు తుది గడువు రేపు

ఎంవీపీకాలనీ: డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 28లోపు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. షార్ట్‌లిస్ట్ ద్వారా ఎంపికైన అభ్యర్థులు డీఎస్సీ శిక్షణ ఇస్తున్న సంస్థలను ఈ వెబ్‌ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలన్నారు. అన్ని కోచింగ్ సంస్థలకు వెబ్ ఆప్షన్స్‌లో ప్రాధాన్యతలు ఇవ్వాలన్నారు.

ఎస్‌వోపీతో సజావుగా చందనోత్సవం


రామచంద్రమోహన్‌కు అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న దేవస్థానం ఈవో సుబ్బారావు

సింహాచలం: వచ్చే నెల 30న జరగనున్న చందనోత్సవంలో స్వామివారి నిజరూప దర్శనానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ)ను రూపొందించినట్లు రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ తెలిపారు. బుధవారం సింహాచలం వచ్చిన ఆయన స్వామివారిని దర్శించుకుని, స్థానిక మీడియాతో మాట్లాడారు. సింహాచలం క్షేత్రంలో చందనోత్సవం చాలా పెద్ద ఉత్సవమని, రోజులో కొన్ని గంటలు మాత్రమే ఉంటుందన్నారు. ఏటా లక్ష 50 వేలమంది భక్తులతో పాటు వీఐపీలు కూడా స్వామివారి నిజరూప దర్శనానికి వస్తారన్నారు. ఇప్పటి వరకు జరిగిన పలు చందనోత్సవాల్లో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఎస్‌ఓపీ రూపొందించామన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. చందనోత్సవం నిర్వహణపై వచ్చేనెల మొదటి వారంలో ప్రభుత్వ స్థాయిలో దేవదాయశాఖ, హోంశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రులతో ఒక సమావేశం జరుగుతుందన్నారు. దేవదాయశాఖలో ఎస్ఎంఆర్‌ల పర్మినెంట్ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. దర్శనార్థం ఆలయానికి వచ్చిన ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేష వస్త్రాన్ని ఈవో కె.సుబ్బారావు అందించారు.

మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ ఉచితం

• ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయాల్సిందే..
• కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు వికాస్ పాండే

డాబాగార్డెన్స్: వాణిజ్య సంస్థలు, మాల్స్, మల్టీప్లెక్స్‌లలో పార్కింగ్ రుసుం వసూలుపై రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసిందని కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ మోడల్ బిల్డింగ్ బైలాస్ 2016 ఆధారంగా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్-2017 ప్రకారం, భవనాల్లో తప్పనిసరిగా పార్కింగ్ స్థలం ఉండాలన్నారు. అయితే మాల్స్, మల్టీప్లెక్స్‌లు పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. అలాగే మున్సిపల్ శాఖ జారీ చేసిన జీవో 44 ప్రకారం, గతంలో (2017లోని జీవో 119) ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు కూడా అందజేశామన్నారు. దీనిపై స్పందించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్.. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ స్థలాల దుర్వినియోగాన్ని నిరోధించేందుకు మార్గదర్శకాలు రూపొందించిందన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం మొదటి 30 నిమిషాల వరకు పార్కింగ్ ఉచితమని, 30 నిమిషాల నుంచి గంట వరకు పార్కింగ్ చేస్తే.. ఎటువంటి బిల్లు చూపించినా పార్కింగ్ ఉచితమన్నారు. గంట దాటిన తర్వాత, మాల్ లేదా మల్టీప్లెక్స్‌లో షాపింగ్ చేసినట్లు బిల్లు లేదా సినిమా టికెట్ చూపించకపోతేనే పార్కింగ్ రుసుం వసూలు చేయవచ్చన్నారు. షాపింగ్ చేసినట్లు రుజువు చూపిస్తే పార్కింగ్ ఉచితమని వివరించారు. ఈ ఆదేశాలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని, వీటిని ఉల్లంఘించిన వారిపై అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

30న డీసీతో సన్‌రైజర్స్ ఢీ

• నేటి నుంచి ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో మరో మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియం సిద్ధంగా ఉంది. ఈ నెల 30న జరిగే డే-నైట్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్)తో తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం మరికొన్ని గంటల్లో టికెట్ విక్రయాలు ఆన్‌లైన్‌లో ప్రారంభం కానుండగా, తొమ్మిది వేర్వేరు ధరల్లో టికెట్లు అందుబాటులో ఉండనున్నాయి. కాగా.. ఎస్ఆర్‌హెచ్ ఈ నెల 28న విశాఖ చేరుకోనుంది. 29న స్టేడియంలో ప్రాక్టీస్ చేయనుంది.